"వెళ్తున్నాను. జాగ్రత్త!" అంటూ భర్త నాగేంద్రం వీధిలోకి నాలు గడుగులు వేసిన తరువాత, బాపమ్మ కుడి చేతిని కొంచెం పైకెత్తి "వెళ్ళిరండి!" అని గొణిగింది.

ప్రతి శనివారం సాయంత్రం అతడు ఇలాగే అంటూండడం, తను అదేవిధంగా వెనక "వెళ్ళిరండి" అని దీవిస్తూండడం; గడచిన నాలుగు సంవత్సరాల నుంచీ జరుగుతున్న విషయం. ఏ ఒక్కసారైనా తను ఆ దీవించడం మరిచిపోయిఉన్నా. లేక "వెళ్ళిరండి" అనే మాటకు బదులు (గా) పొరపాటున 'వెళ్ళండి' అని అన్నా ఎంత ప్రమాదం జరిగి ఉండేదో ఆమెకు తెలుసు. అందుకనే ప్రతి శనివారం ఉదయంనుంచే "వెళ్ళిరండి" అనే ఆ దివ్య వాక్యాన్ని తిరిగి తిరిగి మననం చేస్తూ — తీరా సాయంకాలానికి భర్త "వెళ్ళుతున్నాను" అంటే "వెళ్ళిరండి" అని, చప్పున తను అనేసేది.

బాపమ్మకు భర్త నాగేంద్రం అంటే కొంత అసంతృప్తీ, నిరాశా అప్పుడప్పుడూ కలుగుతుండేమాట నిజం. దానికి బలమైన కారణం లేకపోలేదు.

తను పతిభక్తిగల ఉత్తమ ఇల్లాలుగా ఆ భర్తకోసం ఎటువంటి త్యాగమైనా చేయడానికి సిద్ధమే. భర్త ఆ కామాక్షితో వారానికి వచ్చే ఆ రెండురోజుల్నేగాక అసలా బడిపంతులు ఉద్యోగానికే రాజీనామా పెట్టి, మొత్తం రోజులూ—అక్కడే ఆ కామాక్షితో, లేక అతనికి నచ్చిన మరే స్త్రీతో నయినా ఆనందంగా కాలం గడిపినా సహించి ఊరుకోగలదు. ధర్మపత్నిగా భర్త ఆనందాన్ని, సౌఖ్యాన్నీ—అవి అతడు ఎక్కడనుంచి, ఏ రూపంలో పొందగలిగినా, చూసి తనూ సంతోషించడంగాక, తనక్కావలసింది ఏముంది?

కాని నాగేంద్రంలో ఈమధ్య అప్పుడప్పుడూ హఠాత్తుగా సంభవిస్తూన్న మార్పుల్ని చూస్తుంటే ఆమెకు విచారమూ, నిరాశా కలగసాగింది.

"బాపీ! నిన్ను చాలా బాధ పెడుతున్నాను! కాని ఏం చేసేది? ఆ కామాక్షి నన్ను బానిసగా చేసుకుంది. అయినా, ఎప్పటికైనా, ఈ అవినీతి మార్గంనుంచి మారి నిన్ను క్షమాపణ అడిగేరోజు రాకపోదు." అప్పుడు ఆమె విపరీతమైన బాధతో కుమిలిపోయేది.

"మీరు ఆ ఒక్క కామాక్షితోనేగాక మరెందరి దగ్గర కెళ్ళినా నాకు బాధలేదు. మీ ధర్మపత్నిగా మీ సుఖం, ఆనందం గాక నేను కోరదగింది ఏముంది?"

అలాంటి సమయాల్లో నాగేంద్రం ఆమెను దగ్గరగా తీసుకుని ముద్దులతో నలిపేస్తూ— "నువ్వు నా దేవతవి. పూర్వ జన్మ సుకృతంవల్ల భార్యగా దొరికావు." అంటూ నా బుగ్గల్ని గట్టిగా వత్తి పైపంచ వేసుకుని, నిట్టూరుస్తూ కామాక్షి దగ్గరికి వెళ్ళిపోయేవాడు.

వెళ్తున్నానని చెప్పి వేగంగా నడిచి పోతున్న భర్తని రోడ్డుమూల తిరిగిందాకా చూసి, బాపమ్మ బరువెక్కిన హృదయంతో తలుపు గడేసి పందిరిమంచంమీద నడుంవాల్చింది. నిన్నసాయంత్రం శాస్త్రిగారింటికివచ్చినసోమమ్మతో మాట్లాడిన దగ్గర నుంచి, ఆమె మనశ్శాంతిని కోల్పోయింది. దొంగతనాలూ, హత్యలూ చేసిన వాళ్ళతో పాటు వ్యభిచారులు కూడా తప్పక నరకానికే వెళ్తారని ఆమె దృఢంగాచెప్పినప్పుడు బాపమ్మ హృదయం వేగంగా కొట్టుకున్నది. ఆమెకు వెంటనే తన భర్త విషయం గుర్తుకొచ్చింది, అతడు గడచిన నాలుగు సంవత్సరాల నుంచి చేస్తున్నది ఏమిటి? అయినా అతడు మంచివాడు,సహృదయుడు ఈ స్వల్పానికి యమలోకం వెళ్ళవలసి ఉంటుందనేది ఆమె నమ్మలేకపోయింది. భర్తను నరక బాధలనుంచి తప్పించలేని తన పతిభక్తి, పాతివ్రత్యం ఎందుకు?




# అమాయకురాలు

బద్దిగం అరుణశ్రీ శి పాండురంగా రెడ్డి

భయం భయంగానే సోమమ్మను ప్రశ్నించింది.

"ఆ వ్యభిచారి ఓ గొప్ప పతివ్రత భర్త అయిఉండాడే?" సోమమ్మ ఏమాత్రం ఆలోచించకుండా ఠక్కున జవాబిచ్చింది.

'ఇతర స్త్రీల పాతివ్రత్యాన్ని హరించే

వాడిని, వాడి సొంత భార్య పాతివ్రత్యం నరక బాధల్నుంచి కాపాడలేదు.

బాపమ్మ(కు) అక్కడే పైశ్యపు తెర వచ్చి పడిపోయేంత పని జరిగింది. ఇంట్లో ఏదో అవసరమైన పని ఉన్నదంటూ చప్పున అక్కడ నుంచి బయలుదేరి వచ్చేసింది.

పందిరి మంచంమీద అటూఇటూ రెండు సార్లు వేగంగా పొర్లి బాపమ్మ తన భర్తను గురించి ఆలోచించ మొదలుపెట్టింది. ఎంత మనోవ్యాకులానైనా సరే ఇట్టే మాన్పి. నిర్మల శాంతిని గూర్చేవి ఆమెకు అతడిని గురించిన ఊహలే. కామాక్షి దగ్గర అతడికి ఏ ప్రమాదం జరగకుండా ఉండాలనీ ఆమె భర్త నుంచి గాని లేక ఆమెకు ఉన్న ఇతర ప్రియుల్నుంచి గాని తన భర్తకు ఏమీ ఆపద సంభవించకుండా కాపాడమనీ, భగవంతుడిని – ప్రార్థించింది.

నాలుగు సంవత్సరాల నుంచి తను చేసే ప్రార్థనల్ని ఆలించి భర్తకు ఏ ప్రమాదం రాకుండా కామాక్షితో వ్యవహారం సవ్యంగా జరిగిపోయేట్టు చూస్తున్న ఆ పిచ్చి దేవుడిని, ఆయనను ఇహలోక యాత్ర చాలించిన తరువాత. నరకానికి తోయకుండా. తనతోపాటు స్వర్గానికి వచ్చేటట్టు చూడమని వేడుకుంటే, తనకోర్కెను తోసేస్తాడా? విష్ణుమూర్తి పరమ భక్తుల కోర్కెలు కాదన్న సందర్భాలు ఉన్నాయేమోగాని, పతివ్రతల అభీష్టాన్ని పెడచెవిని పెట్టిన సందర్భాలు ఏ పురాణంలోనూ లేవు.

బాపమ్మ మంచందిగి, లక్ష్మీ సమేతుడై ఉన్న విష్ణుమూర్తి పటంముందు చేతులు జోడించి కళ్లు మూసేందుకు సిద్ధపడుతున్న సమయంలో, హఠాత్తుగా వాకిలితలుపు ఎవరో కొట్టారు.

ఆమెకు ఇదో బరువైన అపశకునంలా తోచింది. విస్పత్తునగా, జాలిగా తలుపు వంక చూచింది. మళ్ళీ తలుపు గట్టిగా కొట్టినట్టు శబ్దం, పెద్ద కేక.

"బాపమ్మగారూ! బాపమ్మగారూ!"

ఆమె జోడించిన చేతుల్ని తిరిగి స్వాధీనంలోకి తెచ్చుకొని, ప్రార్థనా వాక్యాల్ని గొంతులోనుంచి జారిపోకుండా బిగబట్టి తలుపు తెరిచింది.

"మా అమ్మ మిమ్మల్ని వెంటనే రమ్మంది" శాస్త్రిగారి కూతురు రొప్పుతూ చెప్పింది.

"ఎందుకు?"

"మంచి మంచి పటాలు అమ్మకానికి వచ్చినై. మీరు వెంటనే రండి. నేను బొమ్మలు చూడాలి వెళ్తున్నా" ఆ అమ్మాయి ఈ మాటలు చెబుతూనే తుర్రున పరుగెత్తింది.

బాపమ్మ అక్కడే ఓ నిమిషం తటపటాయించింది. ప్రార్థన పూర్తిచేసి వెళ్ళడమా లేక ముందుగా పటాలు చూసి రావడమా? దేవుడిని ప్రార్థించేందుకు సమయాసమయాలంటూ లేవనేది ఆమెకు జ్ఞాపకం వచ్చింది. తలుపు గొళ్ళెంపెట్టి శాస్త్రిగారింటివైపు నడిచింది.

శాస్త్రిగారి ఇంటి పంచపాళీ అంతా కోలాహలంగ ఉంది. పటాలు అమ్మేవాడు ఐదారుగజాలమేర అంతా రకరకాల బొమ్మలు పరచి కొన్నిటిని చేతిలో ఎత్తి చూపెడుతూ ఉపన్యాసం దంచుతున్నాడు.

"ఈయన ఇప్పుడిప్పుడే పేరులోకి వస్తున్న దేముడు. భక్తులెవరికీ సమాధిలోనుంచే రక్షణ ఇస్తాడు."

"పుట్టపర్తి సాయిబాబాకన్నా గొప్పవాడా?" శాస్త్రిగారి భార్య ప్రశ్నించింది.

"అవునమ్మా! ఆయనకంటేకూడా గొప్పవాడు. నిన్న ఈ ఊళ్ళో ఇరవై పటాలు అమ్మాను. అప్పుడే కొన్ని అద్భుతాలు కనబడినవి" అని తెల్లవారి నాతో కొందరు చెప్పారు. పైగా తక్కిన అన్ని పటాలకంటె చౌక."

బాపమ్మ పెదిమ విరుస్తూ. శాస్త్రిగారి

భార్యపైపు చూసి "భార్యకంటె మనకు ఇతర దేవుళ్ళు ఎందుకండి?" అన్నాడు.

సోమమ్మ పళ్ళూడిపోయేంత పెద్దగా నవ్వి "అదేనండి నేను మా సావిత్రితో చెబుతున్నాను. స్త్రీకి భర్తకంటె ఇతరదైవాలు ఎక్కడున్నారు?" అన్నది.

పటాలమ్మేవాడు అందరి మొహాలనంక ఓసారి చూసి టక్కున పక్కన ఉన్న ట్రంకులో చేయిపెట్టి, అడుగునుంచి ఓ పెద్ద పటాలకట్ట బయటకులాగాడు.

"ఇదే పరమపద సోపాన పటం! ఇది స్వర్గలోకం! పుణ్యాత్ములు ఉండేది. ఇది నరకం-పాపాత్ములు వెళ్ళేచోటు...."

బాపమ్మ మధ్యలోనే అందుకొని "ఏదీ! ఏదీ!" అంటూ చేయిసాచింది.

"స్వర్గలోకపటమా?" పటాలవాడు ప్రశ్నించాడు.

"కాదు. నరకలోకం...."

వాడు నవ్వుతూ అందించాడు. ఆమె వణుకుతున్న చేతుల్తో అందుకున్నది.

ఆమె ఒక దృశ్యాన్నుండి మరొక దృశ్యానికిచకచకా చూసుకొంటూపోతుంది. ఆమెకు కావలసింది హత్యలు చేసేవాళ్ళు ఎలాంటి నరకబాధలు అనుభవించేదీ, దొంగతనాలు చేసేవాళ్ళని యమకింకరులు ఎలా హింసించేదికాదు.

ఆఖరున తనకు కావలసిన దృశ్యం కంట బడింది. ఆమె భయంతో చిన్న కేకవేసి: పటాన్ని చేతిలో నించి జారవిడిచి, అక్కడే కూలబడ్డింది.

సోమమ్మ తొందరగా ఆమె దగిరకి వచ్చి చెయ్యి పట్టుకుంటూ "ఏం జరిగింది బాపమ్మగారూ! ఏం జరిగింది?" అన్నది.

"నరక లోకమండీ! నరకలోకం ఆఖరికి యముడికి కూడా పక్షపాత బుద్ధి."

పటాలవాడూ, సావిత్రి తెల్లబోయారు. సోమమ్మ మాత్రం నిబ్బరంగా ఆమె పక్కన కూర్చుంటూ "ఏమిటా పక్షపాతం?" అని ప్రశ్నించింది.

బాపమ్మ ఊపిరి గట్టిగా పీలుస్తూ. తడబడే మాటల్తో అన్నది.

"దొంగతనాలూ, హత్యలూ చేసే వాళ్ళ కంటె వ్యభిచారం - చేసేవాళ్ళకు పెద్ద శిక్ష!"

"ఓహో! అంతేగదా. పరవాలేదు; వ్యభిచారులకు అంతశిక్ష పడాల్సిందే."

బాపమ్మకు ఒళ్ళు మరిచిపోయేంత కోపం వచ్చింది. సోమమ్మ గొంతును రెండు చేతుల్తో గట్టిగా పట్టుకొని నలిపేదామన్నంత ఉద్రేకం కలిగింది. కాని ఆమె ఆ ఉద్రేకాన్ని గట్టిగా పళ్ళకొరకడం ద్వారా, గాలిని మరో చిటికెడు అధికంగా పీల్చడంద్వారా అణచిపెట్టి "అయితే వాళ్ళ భార్యల గతేంకాను?" అన్నది.

సోమమ్మ జవాబు కోసం ప్రయత్నం చేసేలోపలే, పటాలవాడు ఓ బొమ్మను ముందుకు పెడుతూ "చూడండి! ఇక్కడ ఈ స్వర్గంలో హాయిగా పూలపెట్ల క్రింద దేవతలతో కాలం గడుపుతున్నారు" అన్నాడు.

"భర్త నరకంలో ఇనుప ముక్కు కాకులవల్ల హింసింపబడుతూ, యమకింకరులచేత నిప్పుల్లోకి త్రోయబడుతూ ఉంటె భార్య స్వర్గలోకంలో పూలపెట్లక్రింద కాలం గడపటం న్యాయమేనంటారా? అది పతివ్రతల లక్షణమేనా?"

తీవ్రంగా, సూటిగా. నిలదీసినట్లు అడి


## రేడియో మెకానిజం

ట్రాన్సిస్టర్, ఎ.సి. ఎ.సి./డి.సి., సమస్త రేడియోల సంపూర్ణ మెకానిజం ఇంటివద్దే నేర్చుకొనుటకు తగిన తెలుగు పుస్తకములు రు. 17. సినిమా ప్రొజెక్టర్, టేప్ రికార్డర్, మైక్ సెట్లు మొదలైన ఆంప్లిఫైర్ల మెకానిజం తెలుగు పుస్తకములు రు. 9-50.

రేడియో, టెలివిజన్ ఇంజనీరింగ్ అండ్ రిపేరింగ్ తెలుగులో పోస్టల్ ట్యూషన్ గలదు.

సుభాష్ రేడియో హవుస్,
నకిరేకల్, నల్లగొండ జిల్లా (ఆం.ప్ర.)

గిన బాపమ్మ ప్రశ్నకు వెంటనే సోమమ్మ జవాబు చెప్పలేక పోయింది. ఆమె ఓ నిముషం ఆలోచించి తడబడుతూ

"మనం ఏం చేయగలం? అది దైవ శాసనం. పాపాత్ములు నరకానికీ, పుణ్యాత్ములు స్వర్గానికీను" అన్నది.

"దైవశాసనాన్ని ధిక్కరించి సూర్య చంద్రాదుల్ని కూడా గడగడలాడించిన పతివ్రతలు ఎంతమంది లేరు. అసలు పెళ్లా (భార్యలు) స్వర్గంలో కులక్కపోతే, భర్తతోపాటు నరకానికే ఎందుకు పోకూడదు?"

సోమమ్మ ముక్కుమీద వేలేసుకొని, బాపమ్మ మొహంలోకి చూస్తూ అన్నది.

"మీరు చెప్పింది అసంభవమండీ బాపమ్మగారూ! పతివ్రతల్ని నరకానికి తీసుకుపోడానికి ప్రయత్నిస్తే - ఆఖరికి ఆ యముడుకూడా భస్మమై పోతాడు."

బాపమ్మ జవాబేమీ చెప్పకుండా రెండు నిముషాలు తలవంచుకుని కూర్చుని చప్పున పటాల వాడివైపుకి తిరిగి "ఆ పటం ఖరీదెంత?" అన్నది.

"ఏ పటం?"

"నరకలోకం." ఆమె పళ్ళు పటపట కొరికింది.

"మూడు పావులాలు"

"అయితే పటం ఇటివ్వు. ఇంటికి రా. డబ్బులిస్తా."

వాడు గుండ్రంగా మడిచి, కాయితంలో చుట్టబోతున్న పటాన్ని చప్పున చేతిలో నుంచి లాక్కొని బాపమ్మ ఇంటివైపుకి నడిచింది.

ఆ రాత్రి బాపమ్మ వంట చేసుకోలేదు. పటాన్ని ఎదురుగా గోడకు తగిలించి, పందిరి మంచంమీద పడుకొని రెప్పవాల్చకుండా దానివైపుకే చూస్తూ, మధ్యమధ్య పిచ్చిదానిలా జుట్టుపీక్కుంటూ నడిరేయి వరకు అంతూపొంతూ లేని ఆలోచనల్తో కాలం గడిపింది. విషయాన్ని ఎన్ని రకాలుగా తిప్పి, కలగా పులగంచేసి, విడదీసి ఆలోచించినా ఆమెకు ఒకటి మాత్రం స్పష్టంగా కనబడుతోంది.

తన భర్త కామాక్షితో గడిచిన నాలుగు సంవత్సరాల్నుంచీ చేస్తున్నది పాపకార్యం. దానికి శిక్ష పరలోకంలో యమకింకరుల శూలపు దెబ్బలూ. ఇనుప ముక్కు కాకుల కఠినమైన పోట్లూ! అయితే తను చేయగలిగిందేమిటి? అందరు పతివ్రతలలాగానే తనూ భర్తను ఆ యమకింకరుల బారికి వదిలేసి హాయిగా స్వర్గంలో పూలచెట్లకింద, చంద్రకాంత శిలలమీదా కాలంగడిపేయడమేనా? పతి ఘోర విపత్తులో మునిగి ఉన్నప్పుడు అది ఇహలోకమైనా - పరలోకమైనా - అతన్ని ఒంటరిగా వదిలి తన సౌఖ్యాన్ని మాత్రమే చూసుకునే భార్య నిజమైన పతివ్రత అవుతుందా? కాదు. కాదు! ముమ్మాటికీ కాదు! బాపమ్మ గట్టిగా అరుస్తూ మంచం మీద లేచి కూర్చుంది.

కిటికీలోంచి వచ్చిన విసురుగాలికి గోడమీది పటం రెపరెప కొట్టుకున్నది. ఆమె బరువెక్కిన గుండెతో. అడుగులు తడబడుతుండగా వణికే చేతులోకి లాంతర్ను తీసుకొని ఆ వెలుగులో పటాన్ని జాగ్రత్తగా పరీక్షించి చూసింది.

"వీడు భార్య ఉండగా పరస్త్రీ పొందు కోరిన పాపాత్ముడు" ఈ మాట స్పష్టంగా ఆ దృశ్యంక్రింద రాసిఉంది. భార్య లేకపోతే పరస్త్రీని కోరవచ్చా? బాపమ్మకు ఆ ధర్మసందేహం హఠాత్తుగా కలిగింది, లాంతరు కిందపెట్టి ఓ నిముషం ఆలోచించింది. కాని ఆమెకు సరైన సమాధానం దొరకలేదు. తిరిగి మంచంమీదికెక్కి పడుకుంటూ "ఇక ఆలోచించి లాభంలేదు, ఆయన నరకానికి వెళ్ళడం, ఆ బాధలూ, హింసలూ అనుభవించడం తప్పదు. ఆయన అటువంటి కష్టాలు అనుభవిస్తుంటే నేను హాయిగా స్వర్గంలో కాలం గడపలేను. నేనూ ఏదో ఘోరపాపం చేస్తాను. నరకంలో కూడా ఆయనకు అండగా, నిజమైన

ధర్మపత్నిగా ఉంటాను" అనుకున్నది.

బాపమ్మ ఈ నిర్ణయానికి రాగానే, మరో సమస్య ఎదురైంది. కణతల్ని గట్టిగా పట్టుకుని, తలగోడకేసి గట్టిగా కొట్టుకుంటూ – "ఏం పాపం చెయ్యగలను? ఏంచేస్తే చాలా – చాలా ఘోరమైనపాపం అవుతుంది?" ఆమె తేలిగ్గా చేయగలిగిన పాపంకోసం ఆలోచించ సాగింది.

రోజూ బడికెళ్ళేటప్పుడు మంచినీళ్ళకోసం తన ఇంట్లోకి వచ్చే చలమయ్యగారి ఐదేళ్ళ కుర్రవాడిని గొంతు పిసికి చంపితే, లేకపోతే శాస్త్రిగారి నాలుగో కూతురు. ఆ రెండేళ్ళ శాంతని ఎత్తి బావిలో పడేస్తే?

బాపమ్మకు ఈ రెండు పనులు చేయడం ఎంత తేలిగ్గా కనపడినయ్యో, అందువల్ల రాబోయే పాపంకూడా అంత స్వల్పంగానే


# అఖిల భారత పాప్యులారిటీ పోటీ

50 మొత్తముగల నమూనా. ఎంట్రీ ఫీజులేదు - మీరు బహుమతి గెలుపొందగలరు

| | | | |
|---|---|---|---|
| 11 | 16 | 9 | 14 |
| 20 | 5 | 18 | 7 |
| 13 | 12 | 15 | 10 |
| 6 | 17 | 8 | 19 |

మొదటి బహుమతి: ఒక వెస్పా స్కూటర్ లేక ఆల్విన్ రిఫ్రిజరేటరు. లేక రు. 3000/- లకు విలువ కలిగిన 200 చ.గ. ప్లాటు

రెండవ బహుమతి ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా. లేక రు. 1500/- విలువ కలిగిన 100 చ.గ. ప్లాటు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మూడవ బహుమతి: (200) యాషికా జపాను మోడల్ పోర్టబుల్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు. వెల: రు. 270/-లో సగం వెల. ప్రతి కుటుంబమునకు బహుమతి.

మీరు చెయ్యవలసినది:

6 (ఆరు) నుంచి 21 (ఇరవైఒకటి) వరకుగల అంకెలను పై ఖాళీ గడులలో నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తం 54 (యాభైనాలుగు) వచ్చునట్లు ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించి పూరించవలయును. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

**ఆఖరి పోస్టింగ్ తేదీ : 22-7-74 ఫలితం తేదీ : 26-7-74**

పోటీకి నిబంధనలు : (1) ప్రమోటర్ల తీర్మానము న్యాయమైనది మరియు కట్టుబడినదిగా న్యాయమైనది. ఈ పోటీ విషయంలో ఇది ఒక ముఖ్యమైన షరతు. (2) ఎంట్రీల యొక్క క్రమమును ఆఫీషియల్ సీల్డు సొల్యూషన్‌తో సరిపోల్చి నిశ్చితంగా చూడబడును. (3) మొదటి బహుమతి: (1) ఆఫీషియల్ సొల్యూషన్‌తో సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (4) రెండవ బహుమతి. (1) ఒక మూడు అడ్డగడులు సమానంగా వున్నదానికి ఇవ్వబడును. (5) మూడవ బహుమతి: (200) మా ఆఫీషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (6) గెలుపొందినవారు వారి బహుమతులు పొందుటకు పోస్టేజీ, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలసిందిగా పోస్టు ద్వారా తెలియపర్చబడును. (7) ఫలితముల కొరకు 15 పైసల స్టాంపులు పంపాలి. (8) ఏ విజేతకు నగదు బహుమతి ఇవ్వబడదు. (9) కటింగ్ లేక నిబంధనల కాపీని భవిష్యత్తులో ఉపయోగార్థం ఉంచుకోండి. (10) ఈ పోటీకి ఎంట్రీఫీజు లేదు. అయితే మూడు నాలుగు షరతులకు లోబడి మొదటి మరియు రెండవ బహుమతులు ఇవ్వబడును.

**MAYUR AGENCY (AJW-54) ALIGARH-19**

కనపడింది. ఆఖరికి పటంలోకూడా ఇటువంటి పాపాలకి స్వల్ప శిక్షలే విధించినట్లు కనబడుతోంది. పైగా నరకంలో ఒక్కోరకమైన నేరానికి ఒక్కోచోటును ప్రత్యేకించినట్లు తెలుస్తుంది. ఆ పద్ధతిలో తన భర్త ఒకచోట బాధపడుతుంటే, తను మరోచోట శిక్షింపబడుతూండడం జరగవచ్చు. అలా జరిగితే తను ఆయన్ను ఓదార్చడం ఎలా? నిజమైన ధర్మపత్నిగా పక్కన వుండి ధైర్యం చెప్పడం ఎట్లా? ఆమె పెదాలు గట్టిగా బిగించి ఎదురుగా ఉన్న పటంవైపుకి చూసింది.

రోడ్డుకు అవతల శివాలయంలో కాపరం పెట్టిన గుడ్లగూబ పెద్దగా అరిచింది. వంటగదిలో పొంచి పట్టుకున్న పెద్ద ఎలుకను నోట కరచుకొని వచ్చి బాపమ్మ పెంపుడు పిల్లి పందిరిమంచం కింద చేరి దాని బొమికల్ని పటపట కొరికింది. పెదగాలికి కిటికీలోంచి లోపల ప్రవేశించి, హరికెన్ లాంతర్ని గప్‌మనిపించింది, ఆమె తలను కాటువేయబోయే పాములాగా రెండుమూర్లు పక్కకి తిప్పి "అంతే" అంటూ నిటారుగా ఎత్తింది.

ఇక ఆ రాత్రి బాపమ్మ నిదురపోలేదు. ఆలోచించను కూడా ఇక ఏమీలేదు. ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. ప్రపంచంలో స్త్రీ జాతి చేయకలిగిన పాపాలు అన్నిటికంటె దారుణమైందీ, ఆఖరిదీ అయిన మహాపాపాన్ని చేయడానికి నిశ్చయించుకున్నది. అంత పాపాన్నీ పత్నిగా, పతివ్రతగా- ఈ ఇహ లోకంలోనేగాక, ఆఖరికి ఆ పరలోకంలోకూడా తనకు తాలి కట్టిన పురుషుడి కష్టసుఖాల్లో భాగం పంచుకునేందుకూ, అతడికి నరకబాధల్ని సహించేందుకు అవసరమైన ధైర్యాన్నీ బలాన్ని ఎప్పటి కప్పుడు పక్కన ఉండి ఇస్తూండేందుకు ఆమె చేయదలుచుకున్నది.

తెల్లవారు ఝామున కోడికూతతో పాటు బాపమ్మ మంచం దిగింది నిర్మల శాంతితో నిశ్చల నిర్ణయంతో, ఇక ఏ ఆలోచనలూ లేకుండా ఆమె గృహకృత్యాలు నిర్వహించ ప్రారంభించింది. ఆమె దృష్టి అప్పుడప్పుడు గోడ గడియారం మీదికి మాత్రం పోతూండేది. ఖచ్చితంగా ఏడు గంటలకల్లా శాస్త్రి గారి పెద్దకొడుకు శంకరం- ఆ పద్దెనిమిదేళ్ళ కుర్రకుంక- పూలకోసం వస్తాడు. దొడ్లో పూలన్నీ కోసుకోనిచ్చి ... తరువాత .... గదిలో — అంతే!

మామూలు ప్రకారం ఏడు గంటలకల్లా శంకరం బుట్ట తీసుకువచ్చాడు. అతడిని దొడ్లోకి పోనిచ్చి, పూలన్నీ కోసుకున్న తరవాత తిరిగి వచ్చేవరకు బాపమ్మ దొడ్డి గుమ్మంలోనే నిలబడింది. ఆమె మనస్సు నిశ్చలంగా ఒకేచోట లగ్నమై వుంది. శంకరాన్ని గదిలోకి తీసుకెళ్ళడం...పందిరిమంచం... తరువాత తన భర్తతో ఈ లోకంలోనేగాక-పరలోకంలోకూడా అవిచ్ఛిన్నంగా కలిసి కాలాన్ని వెళ్ళబుచ్చటం.

బుట్టనిండా పూలు కోసుకుని, కూనిరాగం తీస్తూ శంకరం ద్వారాన్ని సమీపించాడు. ఆమె చేతులు చాపి బుట్టలో పూలు తీసుకుంటూ —

"శంకరం! నీతో పని ఉందోయ్. ఇటురా!" ఆమె గదివైపుకు నడుస్తూ అన్నది.

"ఏం పని?"

"రా! చెబుతా"

అతడ్ని గదిలోకి రానిచ్చి తలుపు గడియవేసింది. శంకరం భయంగా తలుపు వంక చూస్తూ "ఏం పని? తలుపు వేశావెందుకు?" అన్నాడు.

"చిన్న పనోయ్! చాలా చిన్నపని! నీకు తెలీదూ!"

బాపమ్మ నవ్వుతూ అతడి దగ్గరకువచ్చి రెండు చేతులూ పట్టుకుని దగ్గరకు లాక్కున్నది. అతడికి కలిగిన ఆ భయం కాస్తా ఇట్టే ఎగిరిపోయింది. ఆ పతివ్రతకు ఆపైన ఎక్కువ శ్రమ ఇచ్చి అతడు పాపం కట్టుకోలేదు.

ఆ రోజల్లా ఆమె చాలా ఉత్సాహంగా

కాలం గడిపింది. తలమీదనుంచి ఒక గొప్ప భారం దిగిపోయినట్టుగా తోచింది. గదిలోని అన్ని దేవుళ్ళ పటాలనీ, ఆ నరకలోకం పటంతోసహా, ఓ కట్టగట్టి పాతసామాన్ల గదిలో పడేసింది. ఇక ఆ దేవుళ్ళతో, దయ్యాలతో తనకు పనిలేదు. తన భవిష్యత్తు తనభర్త భవిష్యత్తులానే ఈ లోకంలో, పర లోకంలోగూడా నిర్ణయమై పోయింది.

ఆ రాత్రి ఆమె ప్రశాంతంగా నిద్దర పోయింది. మరుసటి దినం ఉదయం మామూలుగా శంకరం వచ్చాడు. నిన్నటి లాగ ఆమె అతడ్ని గదిలోకి తీసుకుపోయి తలుపేయలేదు. శంకరమే ఆమెను వంట గదిలో గ్లాసులూ, చెంబులూ సర్దుతుండగా వచ్చి గట్టిగా చేయిపట్టుకొని గదిలోకి లాక్కుపోయాడు. ఆమె మాట్లాడకుండా అతనితో వెళ్ళింది.

శంకరం వెళ్ళిన తరువాత ఆమెకు మరో సంశయం కలిగింది. నాలుగు సంవత్సరాల భర్త పాపం, ఎప్పుడూ తన పాపానికన్న అధికంగానే వుంటుంది. ఆ నాలుగు సంవత్సరాల ఎడాన్నీ తనెప్పుడూ భర్తీ చేసుకోలేదు. ఈ హెచ్చు తగ్గుల్ని ఆధారంగా తీసుకొని యముడు తన అర్హతని శంకించడుగదా?

ఆ పగలల్లా బాపమ్మ ఈ కొత్త సమస్యతో తల బదలుకొట్టుకున్నది. కాని పరిష్కార మార్గం కనబడలేదు. తను ఇంకో శంకరాన్ని లేక మరో ఇద్దర్ని తెచ్చుకుంటే ....?

మరుసటిరోజు సరిగా భర్త వచ్చే వేళకు ఆమె మామూలుగా వాకిట్లో నిలబడింది.

జనం గుంపులు గుంపులుగా వెళ్ళిపోతున్నారు. ఆమె అలాగే వాకిట్లో నుంచొని రోడ్డు మూలకు చూస్తోంది.

నాగేంద్రం ప్రక్కన మరో విభూతి రేఖల బ్రాహ్మడితో కలసి వస్తున్నాడు. బాపమ్మ ఓ క్షణం ఆ వైపుకు చూసి, కాళ్ళకు నీళ్లు తెచ్చేందుకు లోపలకు వెళ్ళింది. తిరిగి రెండు చెంబుల నీళ్ళతో ఆమె వాకిట్లోకి వస్తూండగా నాగేంద్రం అంటున్నాడు.

"నాకు జీవితంమీదే విరక్తి పుడుతూ ఉందండీ! నాలుగు సంవత్సరాల నుండి ఈ దౌర్భాగ్య జీవితం గడుపుతున్నాను. చేసుకున్న భార్య ఎంత బాధపడిపోతోందో ఈ నాటి వరకు గ్రహించలేకపోయాను."

"ఫరవాలేదు. ఇప్పటికైనా మంచి మార్గానికి వచ్చారు." ఆ బ్రాహ్మడు అంటున్నాడు. బాపమ్మ ఇచ్చిన నీళ్ళ చెంబు అందుకుంటూ నాగేంద్రం తిరిగి ఆయన్ని ప్రశ్నించాడు.

"ఇక ముందుసరే! ఇప్పటి వరకు చేసిన పాపం ఎలా పోతుందంటారు?"

"అన్ని పాపాలు ఎగిరిపోతాయ్! రామనామంలో ఉన్న అద్భుతం అదే! అజామీళుడి కథ మీకు తెలిసే ఉంటుంది. అంత క్రూరకర్ముడు చచ్చే సమయంలో పెంపుడు చిలుకను "నారాయణా" అని పిలిచినంత మాత్రాన పాప పరిహారమై స్వర్గానికి పోయాడు."

"అది కృష్ణశతకంలో చదివిన గుర్తు. ఇంతకీ మీరు చెప్పేదానికి గట్టి ఆధారాలు ఉన్నాయ్యా?"


దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము



హస్తప్రయోగం, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులు, పోస్టుద్వారా కూడా చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల, డా॥ దేవర.
టి. బి. రోడ్, ఫోన్ : 551 తెనాలి.
బ్రాంచి 9-D, శివాజీస్ట్రీట్, మద్రాస్-17

SUVARNA

"ఆధారాలు చాలా వున్నాయి. ముఖ్యంగా ముండకోపనిషత్తు తరువాత పేరు గుర్తుకు రావడంలేదు. ఆ! షండకోపనిషత్తూ ఇలాగే చెబుతున్నాయి."

"ఇంతకీ నన్ను ఏం చేయమంటారు?"

"తీరిక ఉన్నప్పుడల్లా రామనామం జపిస్తూ, ఆ పడిపోయిన ధ్వజస్తంభం బాగుచేయించండి."

బాపమ్మ ఆ ఇద్దరి సంభాషణ ఇంత వరకు విని, ఇక అక్కడ వుండ లేక గది లోకి పోయి ఏడుస్తూ కూర్చున్నది. ఆమెకు కథంతా అర్థం తిరిగినట్టు కనబడింది. తను భర్త కోసం అంత త్యాగం చేసి నరక బాధల్ని అతడితోపాటు సహించేందుకు తయారైతే అతడు స్వర్గానికి వెళ్ళేందుకు మార్గాలు వెతుక్కుంటున్నాడు.

బ్రాహ్మడిని పంపి నాగేంద్రం గదిలోకి వెళ్ళాడు. బాపమ్మ జుటంతా చిందర వందర చేసుకొని ఏడుస్తోంది. అతడు ఆమె పక్కన కూర్చుంటూ జాలిగా —

"నిన్ను చాలా బాధపెట్టాను బాపీ! ఇక ఆ పాప మార్గాన్ని వదిలేశాను ఇందాక ఆ వచ్చిన వారితో నా సంభాషణ వినే వుంటావ్" అన్నాడు.

బాపమ్మ తల పిసుక్కుంటూ — "అయితే నన్నూ ఆ పాప పంకిలాన్నుంచి రక్షించి కాపాడండి. మీరు స్వర్గంలో సుఖిస్తుండగా, నేను నరకంలో బాధపడలేను.

నాగేంద్రం ఆమె నడుంచుట్టూ చేయి పోనిచ్చి బుజ్జగిస్తూ అన్నాడు.

"నీవు మహాపతివ్రతవు బాపీ! నువ్వు చేసిన పాపం ఏమీలేదు. నేనే పాపాత్ముడిని."

నేనూ పాపాత్మురాల్నే! మీ కోసం ... ఆ శాస్త్రిగారి .... శంకరంతో .... పాపం చేశాను."

నాగేంద్రం ఆమె నడుంమీదినుంచి చెయ్యి లాక్కుని, కోపంగా, అనుమానంగా చూస్తూ "ఏం జరిగింది? చెప్పు! త్వరగా చెప్పు!" అన్నాడు.

"మీరు కామాక్షితో చేసే పాపంవల్ల నరకానికి వెళ్ళడం నిశ్చయం అనుకొని, నేనూ - మీ ధర్మపత్నిగా, మీతోపాటు కష్టాల్ని అనుభవించేందుకు. ఆ నరకంలో కూడా మీతో కలిసి ఉండేందుకు ఆ శంకరంతో ఇక్కడే... ఈ మంచంమీదే...."

కుడిచేతి గుప్పిడిని గట్టిగా బిగించి. ఓ మారు చేతిని వెనక్కు తీసి. తీవ్రమైన వేగంతో ముందుకు రానిచ్చి బలంగా నాగేంద్రం (ఆమె) గడ్డం కింద కొట్టిన దెబ్బ కలిగించిన ప్రతిధ్వనిలో బాపమ్మ తక్కిన మాటలు కలిసిపోయినవి. ఆ దెబ్బతో ఆమె నిశ్చేతనంగా పక్కకు ఒరిగిపోయింది. పెద్దగా అరవనూలేదు. కళ్ళు గట్టిగా మూసుకుని, సగం తెగి బయటకు వేలాడుతున్న నాలుకమీద పెదిమల్ని అటూ ఇటూ కదిలిస్తూ ఏదో అస్పష్టంగా అంటోంది.

నాగేంద్రం నిబ్బరంగా అక్కడినుంచి లేచి. తలుపు తీసి సామాన్ల గదిలోకి వెళ్ళి కిరసనాయిలు డబ్బా తెచ్చి. బాపమ్మ మీద కుమ్మరించి గది తలుపు బార్లావేసి, బయటకు రెండడుగులు వేసి, అగ్గిపుల్ల గీసి ఆమె మీదకు విసిరాడు.

నరకజ్వాలలకంటే తీవ్రంగా. భయంకరంగా లేచిన ఆ మంటలు బాపమ్మను కనబడకుండా కప్పేయడాన్ని ఓ క్షణం చూసి, అగ్గిపెట్టెను అక్కడే పడేసి నాగేంద్రం దొడ్డివాకిలి తీసుకొని. దడదూకి రోడ్డుమీదికి పోయాడు.

అతడికి అజామిళుని కథ. శిథిలమైన ధ్వజస్తంభం, భయపడవద్దంటూ హామీ ఇస్తున్నవి. ★

---

సోమరితనంగా కాలం గడపటం, పిరికివాని ఆత్మహత్య వంటిది,

— "మార్గెస్